క్లుప్తంగా...

నేడు పాలకవర్గ సమావేశం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వాణిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సత్కారం



శంకర్‌ను సత్కరిస్తున్న మల్లాపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు

మల్లాపూర్: కాచిగూడ మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టీ బోర్డు సభ్యుడిగా మల్లాపూర్ ఐలా మాజీ చైర్మన్ నిమ్మ శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మల్లాపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మల్లాపూర్ మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి కటార్ల శేఖర్ బాబు, బోనాల మోహన్, గోపు శ్యామ్, కటార్ల వెంకటేష్, రాజుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



యూజీడీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వరి కాలనీలో రూ.8 లక్షలతో చేపట్టిన యూజీడీ పైపులైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, మల్లారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి



అల్వాల్‌లోని డివిజన్ సెక్షన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అల్వాల్: జలమండలి అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్(బీఆర్‌ఎస్‌కేవీ) ఉద్యోగులకు జీవో నంబర్– 14, 60 ప్రకారం వేతనాలు పెంచాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఫాదర్ బాలయ్యనగర్, మచ్చబొల్లారం, వెంకటాపురం, అల్వాల్, మంగాపురం తదితర ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ కార్మికులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికులకు జీవో నంబర్ 14, 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో విద్య సులభతరం



స్కిల్ బ్యాంక్ సీఈఓలతో పాఠశాల నిర్వాహకులు

బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతుల బోధనను ప్రారంభిస్తున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెంగిచర్లలో స్కిల్ బ్యాంక్ (యూఏస్ఎస్) సంస్థ సీఈఓలు మోపర్తి సుధాకర్, మోపర్తి లక్ష్మి, లక్ష్మీనారాయణతో ఆయన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు డిజిటల్ బోధన ద్వారా విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జన, విద్యను ఆర్జించడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమా పాల్గొన్నారు.

సమ్మేళనాల్లో విభేదాల రాగం

నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళానికి పిలవలేదంటున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెడ్పీ చైర్మన్‌ను పిలవాల్సిన అవసరమేంటి..? వారే రావాలంటున్న మంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్ బీఆర్‌ఎస్‌లో బహిర్గతమైన విభేదాలు
- ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా నేతల మధ్య పెరుగుతున్న దూరం
- జిల్లా సమన్వయకర్తతో నేతల మధ్య సమన్వయం కుదిరేనా..?

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలు కాస్తా.. నేతల మధ్య చాపకింద నీరులా అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు బహిర్గతమవడంతో కేడర్ తీవ్ర అయోమయానికి గురవుతోంది. మంగళవారం దేవరయాంజల్‌లో జరిగిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి దూరంగా ఉండటంపై కార్యకర్తల్లో చర్చ సాగుతోంది.

అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం..

సమ్మేళనానికి ఆహ్వానం లేకపోవటం వల్లే హాజరు కాలేదని సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి పేర్కొంటుండగా, వారిని పిలవాల్సిన అవసరమేంటి..? వారే రావాలని మంత్రి మల్లారెడ్డి వాదిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లో అందరూ పాల్గొనాలని అధిష్టానమే ఆదేశించిందని, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిని తాను పిలవడం ఏంటని.. వారే రావాలి కదా అని మంత్రి మల్లారెడ్డి పేర్కొంటున్నారు. గతంలో మండల, పురపాలక స్థాయి సమావేశాల్లో పాల్గొన్న వారిని.. ఎవరు పిలిస్తే వచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ఆ సమావేశాలకు ఆహ్వానం ఉండటం వల్లే పాల్గొన్నామని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి వ్యవహారాన్ని, ఆత్మీయ సమ్మేళనాలకు ఆహ్వానించని విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు ఇలా..

మేడ్చల్ జిల్లాలో దాదాపు నెల రోజులుగా మండల, పురపాలక సంఘాలు, అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిల్లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు పార్టీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిష్టానం నియమించింది. మార్చి 24 నుంచి జిల్లాలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతుండగా, మేడ్చల్ నియోజకవర్గంలో మాత్రం 10 పురపాలక సంఘాలు, 5 మండలాల సమావేశాలకు 6 పురపాలికలు, 4 మండలాల్లో మాత్రమే జరిగాయి. ఇంకా పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ పురపాలక సంఘాలతోపాటు ఎంసీపల్లి మండలంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాల్సి ఉంది.

గతంలో ఐదుగురు ఎమ్మెల్యేల తిరుగుబాటు..

మేడ్చల్ జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల మధ్య అంతర్గంగా కొనసాగుతున్న విభేదాలు ఆత్మీయ సమ్మేళనాలతో పోతాయని భావించినా.. మరింత ముదురుతుండటంతో పరిస్థితి ఎక్కడి దారి తీస్తుందోనని పార్టీ కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలోనే మంత్రి మల్లారెడ్డిపై జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇంత వరకు ఇది ఓ కొలిక్కివచ్చిన దాఖలాలు లేవు. గతంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హన్మంతరావు ఇంట్లో సమావేశమైన ఐదుగురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల విషయంలో మంత్రి మల్లారెడ్డి జోక్యాన్ని తప్పుబట్టారు. ఈ వ్యవహారాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్న విషయం తెల్సిందే. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా నామినేటెడ్ పదవులను కూడా మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఆ సందర్భంలో ఎమ్మెల్యేలు ఆరోపించిన విషయం తెల్సిందే. ఈ వ్యవహారం ఇంకా చక్కబడకపోగా, నివురుగప్పిన నిప్పులా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా..

జిల్లాలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మధ్య విభేదాలు తారస్థాయిలో ఉన్నాయి. కూకట్‌పల్లిలో కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ గ్రూపులను ప్రోత్సహిస్తున్నట్లు పార్టీ కేడర్‌లో గుసగుసలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని 13 పురపాలక సంఘాలలోనే అధికార పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఉన్నప్పటికీ వారి మధ్యనే విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లతో సహా పలు గ్రామాల్లో కూడా పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి.

మూడింటిలో తారస్థాయిలో..

మేడ్చల్ జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మినహాయించి మిగతా కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు సాఫీగానే కొనసాగుతున్నాయి. ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో చాపకింద నీరులా నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నా.. ఆత్మీయ సమ్మేళనాలు మాత్రం సజావుగా నిర్వహిస్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఆత్మీయ సమ్మేళనాల తీరు నేతల మధ్య ఆధిపత్య పోరుకు ఆజ్యం పోస్తోంది. ఇటీవల బోడుప్పల్ పురపాలక సంఘంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం దీనికి నిదర్శంగా నిలుస్తోంది. బోడుప్పల్ సమ్మేళనంలో మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతున్న విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా సమన్వయకర్త, పార్టీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలోనే ఇరువురు నేతలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ.. వాగ్వాదాలకు దిగడం పార్టీ కేడర్‌ను తీవ్ర అయోమయానికి గురిచేసింది.

ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- కేంద్రానివి పనికిరాని ఆరోపణలు
- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

గౌతంనగర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుంటే కేంద్ర ప్రభుత్వం పనికిరాని ఆరోపణలు చేస్తోందని బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సభ మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీసాయి గార్డెన్‌లో జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, నియోజకవర్గ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ఉచితంగా రక్షిత తాగునీరు, రైతుకు రూ.5 లక్షల బీమా, రైతుబంధు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, మహిళలకు కేసీఆర్ కిట్లు, పెన్షన్లు, దళితబంధు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల సునీత రాముయాదవ్, ప్రేంకుమార్, మీనా ఉపేందర్‌రెడ్డి, చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, జితేంద్రనాథ్, సబితకిషోర్, పిట్టల శ్రీనివాస్, బద్దం పరుశురాంరెడ్డి, గుండా నిరంజన్, జేఏసీ వెంకన్న, జీఎన్‌వీ సతీష్‌కుమార్, ఎంజీకే నయిమ్‌ఖాన్, అమినుద్దీన్ పాల్గొన్నారు.

సుపరిపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

అల్వాల్: ప్రజలకు మంచి పరిపాలన అందించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా మంగళవారం లోతుకుంట, రాజీవ్ వీకర్ సెక్షన్‌లో జరిగింది. కార్యక్రమానికి నందికంటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ నుంచి రూ.5 లక్షల ఉచిత వైద్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల సహాయం, మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందని భరోసా కల్పించారు.



ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న నందికంటి శ్రీధర్

కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్, జోలి రమేష్, నిమ్మ అశోక్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, సీఎల్. యాదగిరి, కృష్ణగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్, వీనస్‌మేరీ, పద్మ, నిర్మల పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి నిరసన



సమ్మెలో విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికులు

కుషాయిగూడ: న్యాయమైన డిమాండ్లను సాధనకు విద్యుత్ ఆర్టిజన్లు సమ్మెబాట పట్టారు. మంగళవారం తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సైనిక్‌పురి సబ్ డివిజన్, చర్లపల్లి పారిశ్రామికవాడలోని కార్యాలయ వద్ద నిరసన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కారించాలంటూ ఆచార్య జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆందోళనకు దిగిన కార్మికులను పోలీసులు చెదరగొట్టి స్టేషన్‌కు తరలించారు.

వెంటనే సమస్యలు పరిష్కరించాలి

మౌలాలి: విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టిజన్ కార్మికులు మంగళవారం మౌలాలిలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిమ్మల వెంకట్‌రెడ్డి, సంజీవ, బాల్‌రెడ్డి, జానయ్, కై వల్యం, ఉపేందర్‌రెడ్డి, బాలరాజు, మోహన్‌రావు, భాస్కర్, ప్రసాద్, నరేష్, రమాదేవి, మమత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భెల్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలోని 4వ బ్లాక్ సమీపంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు రేకుల పైనుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన భాస్కర్ గౌడ్(39) భెల్ పరిశ్రమలో కాంట్రాక్టర్ రమేశ్ పరిధిలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో భాస్కర్ గౌడ్ 4 బ్లాక్ సమీపంలో షెడ్ పైకి ఎక్కి ఫ్యాన్ బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీల ప్రజలు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పలుచోట్ల స్వీట్లు పంచుకొని బీఆర్‌ఎస్ జిందాబాద్.. కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం ఖాయమని ఈ సందర్భంగా పలువులు నేతలు పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి అనంతరం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యేందుకు పెద్దఎత్తున తరలివెళ్లారు.



జెండా ఆవిష్కరణలో బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి



పీర్జాదిగూడలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు



మేడిపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ తదితరులు



పీర్జాదిగూడ 25వ డివిజన్ సాయినగర్ కాలనీలో కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్



ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న బన్నాల ప్రవీణ్

మూడోసారి గులాబీ జెండా ఎగరాలి

మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: ఉప్పల్‌లో ముచ్చటగా మూడోసారి గులాబీ జెండాను ఎగురవేయాలని మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్లపల్లిలో జరిగిన ఉప్పల్ నియోజకవర్గ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ జెండాను ఎగురువేశారు. అమరవీరులకు నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయం రైతు సంక్షేమం, సామాజిక భద్రత, బీసీ సంక్షేమం, దళిత సంక్షేమం, విద్యా ఉద్యోగం, పల్లె పట్టణ ప్రగతి, ధరల పెరుగుదల మోదీ వైఫల్యం, మైనార్టీ సంక్షేమం, ఐటీఆర్ రద్దు మెట్రో రెండోదశ తిరస్కరణ, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం అనే పది అంశాలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 2014 ఉద్యమం సమయంలో కేసీఆర్ కన్నకలలను నిజం చేస్తూ బంగారు తెలంగాణ సాధన దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. విజన్ కలిగిన నేతగా దేశంలో ఎక్కడా లేని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే సొంతమన్నారు. కోటి ఎకరాల మాగానికి సాగునీరు, ప్రతి ఇంటికీ తాగునీరు, పండించిన ప్రతిగింజా కొనుగోలు చేస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతోందన్నారు. గడిచిన నాలుగేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఐఏఎం, మెడికల్, పారామెడికల్, మెడికల్ యూనివర్సిటీ, నవోదయ వంటి ఒక్క విద్యాసంస్థనైనా తెలంగాణకు ఇచ్చిందా అని ప్రశ్నించారు. నిత్యం విమర్శలు చేసే బీజేపీ నాయకులకు సిగ్గు శెరం ఉందా అన్నారు. ఇక కాంగ్రెస్ పూర్తిగా చేవలేని పార్టీగా మారిందన్నారు. ఉద్యమ నాయకులందరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత నాదే అన్నారు. రానున్న ఎన్నికల్లో అంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. సమష్టిగా కృషిచేసి రాష్ట్రంలో గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శాంతి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, బేతి స్వప్నారెడ్డి, పావనీరెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బేతి సుమంత్‌రెడ్డి, జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్, సుడుగు మహేందర్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైందవ ధర్మ రక్షకులు శంకరాచార్యులు



శంకరాచార్య జయంతి సందర్భంగా శోభాయాత్ర

రామంతాపూర్: సనాతన వైదిక బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జగద్గురు శ్రీఆది శంకరాచార్యుల వారి జయంతిని పురస్కరించుకుని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీనివాసపురం కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ హిందూ మత రక్షకుడు జగద్గురు ఆది శంకరాచార్యులు అని, శంకరాచార్యులు వారి అద్వైత సిద్ధాంతాన్ని సామాన్య జనానికి అర్థమయ్యేలా పండితులు కృషి చేయాలని కోరారు. హైందవ ధర్మ రక్షణకు శంకరాచార్యులు చేసిన కృషిని వారు వివరించారు. ప్రస్తుతం మత మార్పిడి నుంచి హిందువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై, హిందూ మత పరిరక్షణ సంస్థలపై ఉందన్నారు. కార్యక్రమంలో సాంబ శివానంద భారతి స్వామి, డాక్టర్ శ్రవణ్ కుమార్, వైదిక సేవా సమితి అధ్యక్షులు పాలకుర్తి లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఓగిరాల రమేష్, రామ్‌నాథ్, సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌ను కబ్జా చేసిన వ్యక్తులపై కేసు నమోదు

బోడుప్పల్: ఒకరి ప్లాట్‌ను అక్రమంగా ఆక్రమించుకుని మరొకరికి విక్రయించిన వ్యక్తులపై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌గిరి, బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోడుప్పల్‌లో నివాసముండే మిడియా సావిత్రి(50), యాదగిరి భార్యాభర్తలు. సావిత్రికి సర్వే నంబర్ 63/1లోని దేవేందర్‌నగర్‌లో 60 గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. సదరు స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు డబ్బులు లేక ఓ చిన్న ఇంటిలో అద్దెకు ఉంటోంది. ఈక్రమంలో కొంత మంది సావిత్రి ప్లాట్‌ను కబ్జా చేసి ఓ ఇంటిని నిర్మించి ఇతరులకు విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగకపోవడంతో మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కబ్జా చేసి విక్రయించిన గడ్డం రాజు, కరుణాకర్, మహేందర్, కృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.